


# క్షీరసాగర మథనం

## - నిర్మలాదిత్య

*(గత సంచిక తరువాయి)*

"ఇంకా తాకట్టు అకౌంట్లే? మా బ్యాంక్ ద్వారా కాష్ క్రెడిట్ అకౌంట్లు ప్రయత్నిస్తా. గోడౌన్, తాళం చెవుల ప్రసక్తి లేదు. ప్రతీ నెలా స్టాక్ స్టేట్మెంట్ ఇస్తే చాలు" అన్నాడు వినోద్.

కుర్రాడు మంచి తెలివైన వాడే అనుకున్నాడు పి.ఎల్. "అన్నట్టు నీకు స్కూటర్ ఉంది గదా వినోద్, ఇక్కడే మాకో ఇల్లు ఖాళీగా పడి ఉంది, నీవు కావాలంటే, ఇక్కడికి మరిపో. రేపు పెళ్లి అయ్యినా సరిపోతుంది" అన్నాడు ఏక వచనంతో సంబోధిస్తూ, ఆప్యాయంగా.

"అబ్బే వద్దండి. నాకు ఇప్పుడున్న రూమ్ సరిపోతుంది" అన్నాడు వినోద్.

ఆఫీసు వెళ్లి, చెన్నై లో ఉన్న రీజినల్ ఆఫీసర్ కు ఫోన్ చేసి మంచి అకౌంటని, క్రోమ్ టానింగ్ కు మార్చే అవకాశం ఉందని చెప్పాడు.

అవతల ఆఫీసర్ కంఠం లీలగా వినిపిస్తున్నది.

'కంగ్రాట్స్. ఈ అకౌంట్ తే గలిగితే నీకు ప్రమోషనే. ఇపుడే ఆ క్రోమ్ ఫ్యాక్టరీ వాళ్లకు ఫోన్ చేసి చెప్తాను. వాళ్ళు వారి మార్కెటింగ్ గురించి ఆలోచిస్తున్నారు. మనం మరిన్ని వాటిని క్రోమ్ టానింగ్ మార్చ గలిగితే, అది అందరికి ఉపయోగకరమే"

ప్రమోషన్ అన్న మాటతో వినోద్ ముఖంలో తళుక్కుమన్న వెలుగు పి.ఎల్. కళ్ళని తప్పించుకోలేక పోయాయి.

"ఎస్ టి డి ఛార్జ్ కదండీ. ఎంతనో చెప్తే ఇస్తాను" అన్నాడు వినోద్. ఇంత వరకు ఈ రూమ్ కు వచ్చి తనంతకు తానే డబ్బు కడ్తామన్న మొదటి వ్యక్తి వినోద్. కుర్ర కారు కదా. తొందరలోనే మారుతాడు. మనస్సులోనే నవ్వుకున్నాడు పి.ఎల్.

"చాయ్ తాగుతావ, కలరా" అన్నాడు పి.ఎల్.

"అబ్బే ఏది వద్దండి. ఇంకో రెండు రోజుల్లో లోన్ మేళా ఉంది. మా బ్రాంచి నుంచి 100 కుట్టు మషీన్లు, 100 బర్రెల లోన్లు సాంక్షన్ చేయాలి. ఇంకా ఈ లోన్ల ఫారాలు తీసుకొని, అప్పు తీర్చగల వారి కోసం వెదుకుతున్నాం. వచ్చే వారం మీ ప్రపోసల్ పూర్తి చేద్దాం" అంటూ వీడ్కోలు తీసుకుంటూ లేచాడు వినోద్.

పి.ఎల్. కు వినోద్ మాటలు ఊరట కలిగించాయి. పీర్ చెప్పింది నిజమే. ఇక్కడి డబ్బులు అక్కడ బెట్టి, ఎదో నడిపిస్తున్నాడు కానీ పీకల దాక మునిగి పోయాడు. అది తను పైకి పోవాలనే తపన తో తీసుకున్న రిస్క్ వల్లే. కొత్త బ్యాంక్ లోను వస్తుందని, తమ సమస్యలు తీరుతాయని పూర్తి నమ్మకం లేదు. కానీ ఈ లోన్ రాకపోతే బిజినెస్ దివాలా తీస్తుందేమో అన్న ఆలోచనలు పి.ఎల్. ను రాత్రులలో నిద్ర పోనివ్వటం లేదు.

కొత్త బిచ్చగ్గాడు పొద్దెరగడు అన్నట్లు, ఈ వినోద్ బర్రెల అప్పులు ఇవ్వడానికి బయలు దేరాడు. ఏ పుట్టలో ఏ పాముందో? అయినా, వినోద్ తో పనిచేయడం కంటే, గత్యంతరం లేదు, తనున్న పరిస్థితుల్లో అని అనుకున్నాడు స్వగతం లో. పి.ఎల్. కు వెంటనే ఏలుమలై గుర్తుకు వచ్చాడు.

"వినోద్, నీవు తొందరగా అప్పులు లోన్ మేళా లో ఇవ్వాలి అంటే నాకు తెలిసినతను ఒకరున్నారు. ఆయనకే ఓ 25 బర్రెల కొట్టం ఉంది. మంచి పలుకుబడి కూడా. ఆయన ద్వారా పోతే ఆయనే బ్యాంక్ లోన్ లకు అర్హులైన వాళ్లను ఈ చుట్టుపక్కన ఉన్న ఊళ్ళ లో నుంచి గుర్తుపట్టి నీ దగ్గరకు పంపిస్తాడు. మీ బ్యాంక్ లోన్ మేళా కని ఇచ్చిన కోట అందుకో కలదు. లోన్ తీర్చడంలోను డోకా ఉండదు" అన్నాడు పి.ఎల్.

"అలాగా. టైము లేదు. మీరు మీకు తెలిసినతని వెంటనే ఈ రోజే పంపించండి. మాట్లా డి చూస్తాను" అన్నాడు వినోద్ రిలీఫ్ తో, తిరిగి బ్యాంక్ కు బయలు దేరాడానికి లేస్తూ.

"నేనూ వస్తాను. ఇప్పుడే ఏలుమలై కి కబురంపుతాను" అంటూ ఆఫీసు ద్వారం వరకు వచ్చాడు పి.ఎల్. ద్వారం బయట రోడ్డు. ఎదురంగా బిల్డింగ్ పైన, ఎల్లుండి లోన్ మేళా అంటూ, పెద్ద పోస్టర్. రాజకీయ నేతల కట్ ఔట్లు. పక్కనే కొత్త సినిమా పోస్టర్. ఎవరో కొత్త యాక్టర్లు.

ఆ కట్ ఔట్లు కింద నున్న స్కూటర్ తీసి స్టార్ట్ చేసి, పి.ఎల్ ను చూసి నవ్వి, చేయి ఊపుతో వీడ్కోలో తీసుకున్నాడు, వినోద్. అతని మనస్సులో ఇంకో రెండు రోజుల్లో బర్రెలు, కుట్టు మెషీన్ లు అప్పుగా తీసుకొనే మనుష్యులు కావాలి, ఎలా పట్టాలనే ఆలోచనలు తిరుగుతూనే ఉన్నాయి.

పి.ఎల్. ఏలుమలై ఇంటికి ఫోన్ చేసాడు. ఏలుమలై భార్య ఫోన్ అందుకొని పొలంకి పోయాడు మరో అరగంటలో రావాలి అని చెప్పింది. ఏలుమలై వచ్చిన వెంటనే తనకు ఫోన్ చేయమని పెట్టేసాడు పి.ఎల్.

ఓ అరగంట తరువాత ఫోన్ వచ్చింది ఏలుమలై నుంచి.

"ఏలు మలై, బ్యాంక్ వాళ్లు బర్రెలకు, కుట్టు మాషీన్లు అమ్మడానికి లోన్లు ఇస్తున్నారు. నువ్వు మీ ఊళ్ళో వాళ్ళ పేరు తో తీసుకొని అప్పు తీర్చేస్తే ఎలా ఉంటుంది" అన్నాడు పి.ఎల్

"ఎన్ని బర్రెల, మషీన్లు" అన్నాడు ఏలుమలై.

"దాదాపు నూరు వరకు అంటున్నారు" అన్నాడు పి.ఎల్.

"నాకైతే మరో 25 బర్రెలు చాలు. సరే కుటుంబం ఒకటికి ఒకటే లోను కదా. నేను బ్యాంక్ తో మాట్లాడు తా లె" అన్నాడు ఏలుమలై.

"వినోద్ అనే కుర్ర ఆఫీసర్ ను ఈ రోజే కలువు. నేను చెప్పి ఉంచుతాలే" అన్నాడు పి.ఎల్.

"ఈ లోన్ మేళా లోన్ లు వాపస్ అడగరని మా ఊరి ఎం ఎల్ ఏ చెప్పినాడు. నీ ఋణం ఉంచుకోనులే సార్" అన్నాడు సంతోషంగా ఏలుమలై.

ఏలుమలై ఇచ్చే డబ్బులతో తన అవసరం తీరేది కాదు. కానీ వినోద్ తాను ఏలుమలైను పరిచయం చేసిందానికి కొత్త లోన్ ఇవ్వ గలిగితే, తను మరో మెట్టు ఎక్కినట్లే. మెట్టు ఏమిటి, బ్రతికి బయట పడినట్లే. వినోద్, పి.ఎల్ ఆలోచనలలో, ఆందోళనల ఛాయల నచ్చని అతిథిలు లాగా, తిష్ట వేసాయి.

– 3 –

టాంప, ఫ్లోరిడా

మే 2014

"160/90 ఉంది. చాల ఎక్కువుంది ఉంది మీ బి.పి రీడింగ్. ఓ పది నిమిషాలు ఆగి, మళ్లీ మరో సారి చెక్ చేయాలి" నర్సు విశ్వం ను చూసి అంది.

"ఇది కొత్త కాదు. నాకు వైట్ కోట్ సిండ్రోమ్ ఉంది. డాక్టర్ దగ్గరకు పోతే బి.పి. ఎక్కువవ్వుతుంది. కొద్దీ సేపట్లో నార్మల్ అయ్యిపోతుంది లెండి"నవ్వుతో అన్నాడు విశ్వం.

ఫ్యామిలీ డాక్టర్ ఇచ్చిన మూడు యూరోలోజిస్ట్ లకూ ఫోన్ చేసాడు. ఆ ముగ్గురిలో కొంత తొందరగా అపోయింట్మెంట్ ఇచ్చింది, ఇతడే. అదీ తాను మొదట ఫోన్ చేసిన రోజు కు ఆరు వారాలు తరువాత.

డాక్టర్ వస్తాడంటూ, నర్సు రూమ్ తలుపులు మూసి బయటకు వెళ్ళింది. విశ్వం ఫోన్లో ప్రోస్టేట్ కాన్సర్ గురించి మళ్లీ చదవడం మొదలెట్టాడు. మగవారికి మాత్రమే, మూత్రాయశయం కింద ఓ చిన్న నిమ్మ పండు సైజ్ ఉండే అవయవమే, ఈ ప్రోస్టేట్. స్కిన్ కాన్సర్ తరువాత ఎక్కువగా వచ్చేది ప్రోస్టేట్ కాన్సర్. ఊపిరి తిత్తుల కాన్సర్ తరువాత, ఎక్కువ మంది మగవారు చనిపోయే కాన్సర్, కూడా ఇదే. కాదంటే ఈ వ్యాధి ఎక్కువగా 60 ఏళ్ళు పై బడిన వారికే వస్తుంది. అలాంటింది, ఇప్పుడే 50లో పడిన, తనకు రావడమేమి విశ్వం ఆలోచనలలో, ఆందోళన మళ్లీ కమ్ముకుంది. తనంటే పిచ్చి గా ప్రేమించే భార్య సీత, తాను పిచ్చిగా ప్రేమించే కూతురు లక్ష్మి గుర్తుకు వచ్చారు. సీత, విశ్వం లక్ష్మిని ముద్దుగా బంగారు అని పిలుస్తారు.

చదువుతుండగా బెత్ నుండి టెక్స్ట్. తాను చేసిన పవర్ పాయింట్ డెక్ మీద ప్రశ్నలు. వెంటనే బదులిచ్చాడు. మరో రెండు ప్రశ్నలు మళ్లీ రావడంతో మరో గంటలో ఆఫీసు కు వస్తానని బలవంతంగా వీడ్కోలో తీసుకున్నాడు, విశ్వం. ఇది వరకే రక రకాల అధికారులను చూసిన విశ్వం కు బెత్ లాంటి మేనేజర్ ఇది వరకు తటస్థ పడక పోవడం అదృష్టమే. ఏ పనీ డెలెగెట్ చేయలేని మేనేజర్ బెత్. పని కోతి అనుకుంటే, కింద వారు చూసుకోవాల్సిన కోతిని పూర్తిగా తన భుజస్కందాల పైన మోయాలనుకోవడమో, కనీసం ఆ కోతి ఒక కాలు బెత్ భుజం మీదను, మరో కాలు విశ్వం మీదను వేసి ప్రయాణం చేయాలనుకోవడం ఆవిడ నైజం. కోతులు, పని, సమయం పైన హార్వర్డ్ బిజినెస్ రివ్యూ లో చదివిన టైం మేనేజ్మెంట్ ఆర్టికల్ గుర్తుకు వచ్చి నవ్వుకున్నాడు, విశ్వం.

డాక్టర్ తలుపు కొట్టి, తెరచి లోపలకు వచ్చి విష్ చేసాడు.

"హౌ అర్ యు డాక్టర్, యు లుక్ యంగ్" అన్నాడు విశ్వం.

"విశ్వం, యు లుక్ యంగ్ టూ" విశ్వం పుట్టిన రోజు, మిగిలిన విషయాలు, నర్సు రాసి పెట్టిన రిపోర్ట్ లో చదువుతూ.

"ఇదేనా మొదటి సారి ఈ పి ఎస్ ఏ టెస్ట్ చేయడం" అని అడిగాడు.

"లేదండి గత సంవత్సరం మొదట చెక్ చేశారు. అప్పుడు 4 కు కొద్దిగా ఎక్కువ ఉండటం వల్ల, చూద్దాం లెండి అన్నారు" అన్నాడు విశ్వం.

చార్ట్ మళ్ళీ చదువుతూ, "యూరిన్ రాత్రికి ఒక సారి లేస్తాను అంటున్నారు, సెక్స్ ఆక్టివిటీ కూడా హై రేటింగ్ ఇచ్చారు. నో కన్సర్న్స్ థేర్. ఫ్యామిలీ హిస్టరీ కొంచెము చెప్పండి" అన్నాడు డాక్టర్.

"మా తాత కు తనకు 70ఏళ్లప్పుడు లో ఇదే సమస్య వచ్చినట్లు, నాకు అనుమానం. పోస్టేట్ బాగా పెద్దగా అయ్యి, మూత్ర నాళం అడ్డుకుంటే,సి ఎం సి వెల్లూరు లో ఆపరేషన్ నాళం బొడ్డు ద్వారా వచ్చేటట్లు చేశారట. మా చిన్నాన్న కూడా అడ్వాన్సుడ్ పోస్టేట్ కాన్సర్ వల్ల 85 ఏళ్లకే పోయారు" చెప్పాడు విశ్వం.

"లెట్ మీ చెక్" అంటూ డిజిటల్ రెక్టల్ ఎక్సమ్ కి గ్లౌజ్ వేసుకొని, డాక్టర్ తన వేలి తో కోలన్ కు కు అంటుకుని ఉన్న ప్రోస్టేట్ ను తడిమి చూసి, గ్లౌజ్ విప్పి ట్రాష్ కెన్ లో వేసి, వాష్ బేసిన్ లో చేతులు సోప్ తో కడుగుకుంటూ,

"ఫ్యామిలీ చరిత్ర ఉందంటున్నారు. మీకు వచ్చినది ప్రోస్టేట్ కాన్సరో, కాదో చూడాలి. అది బయాప్సీ చేస్తే కానీ తెలీదు. బయాప్సి చేయడానికి మా నర్సు ను షెడ్యూల్ చేయమంటాను" అన్నాడు డాక్టర్.

విశ్వం కు సంభాషణ ఈ మలుపు తీసుకోవడం నచ్చలేదు.

"బయాప్సి అంటే ఏమి చేస్తారు?" అడిగాడు విశ్వం, డ్రెస్ సరి చేసుకుంటూ. అది వరకే గూగుల్ చేసి చదివినా, డాక్టర్ ద్వారా వినాలనిపించింది విశ్వం కు.

"ఇప్పుడు మీకు ప్రోస్టేట్ పరీక్ష చేసినట్లే నండి. కాదంటే వేలు బదులు ఓ ప్రోబ్ ద్వారా, సన్న సూదుల తో ప్రోస్టేట్ ను పొడిచి స్పెసిమెన్ సేకరించి టెస్టింగ్ కని పంపిస్తాము. సైడ్ ఎఫెక్ట్స్ పెద్దగా ఉండవు. యూరిన్ ఒకటి రెండు సార్లు ఎర్రగా రావచ్చునేమో. దానికదే సర్దుకొని, పోతుంది" అన్నాడు.

"ఇంకో రెండు వారాలలో ఇండియాకి ట్రావెల్ చేయాలండి. వచ్చిన తరువాత చేసుకోవచ్చా?" అడిగాడు విశ్వం.

"తప్పకుండ. మీకు తగిన సమయము చూసే, ఫిక్స్ చేసుకోండి. ఒకటి రెండు వారాల ఆలస్యం వల్ల నష్టమేమీ లేదు. యు అర్ ఓన్లీ కిక్కింగ్ థి కేన్ డౌన్ థి రోడ్" అని డాక్టర్ వీడ్కోలు తీసుకొని వెళ్ళిపోయాడు.

ఫ్రంట్ డెస్క్ లో ఉన్న అమ్మాయి విశ్వం తో మాట్లాడి రెండు నెలల తరువాత బయాప్సీ కి షెడ్యూల్ చేసింది.

పార్క్ చేసిన కార్ దగ్గర పోతుంటే, భార్య సీత నుండి కాల్.

"ఏమైనదదండి? అంతా నార్మల్ కదా?" అడిగింది సీత.

" ఇంకా కొన్ని టెస్టులు చేయాలంట. ఇంటికి వచ్చి చెప్తాలే. అన్నట్టు బంగారుకు ఇవేవీ చెప్పొదు. హడావిడి పడుతుంది" అని ఫోన్ కట్ చేసాడు విశ్వం.

– 4 –

1986

- పర్యావరణ రక్షణ చట్టం 1986: భారత ప్రభత్వం రాజ్యాంగం ఆర్టికల్ 253 కింద పర్యావరణ చట్టం ఆమోదం.

పి.ఎల్ కు చెన్నై పోయే పని పడింది. క్రోమ్ టానింగ్ పద్ధతికి మారిన తర్వాత బిజినెస్ రెట్టింపై, మొత్తం రూపు మారిపోయింది. చెన్నై లో లావా దేవిలు బాగా పెరిగాయి. బ్యాంక్ వాళ్ళు సౌకర్యం కోసం చెన్నై బ్రాంచ్ లో అకౌంట్ తెరిపించారు. ఆ బ్రాంచ్ లో తోలు వ్యాపారం చేసే వాళ్ళ అకౌంట్లు చాలా ఉన్నాయి. అందుకే పి.ఎల్, చెన్నై లో తమ బిజినెస్ ఆఫీస్ కోసం పారిస్ కార్నర్ దగ్గరే రెండు గదులు అద్దెకు తీసుకుని ఆఫీసుగా మార్చాడు. ఆ ఆఫీసు తెరవడానికే ఈ రోజు చెన్నై వెళ్ళాలి. ఇక ఇలా చెన్నై కు తరచు పోవాల్సి వస్తుందని, ఓ ప్రీమియర్ పద్మిని కారు కూడ బిజినెస్ పేర కొన్నాడు.

పి.ఎల్ భార్య, కనిచెల్వి తో చెన్నై పోతున్నట్టు చెప్పాడు.

"నాకూ సాయంత్రం మా క్లబ్ లో ఫంక్షన్ ఉంది. అబ్బాయి అరసును ఎవరు చూసుకుంటారు?" అంది చెల్వి.

చెల్వి కి కొత్త స్నేహితులు దొరికారు. ఆదాయ మార్పుల బట్టి సాంగత్యమూ మారుతుందని పి.ఎల్ కు అవగతమౌతున్నందు వల్ల, చెల్వి దిన చర్య మార్పులు, పి.ఎల్ ను పెద్దగా కలవర పెట్టలేదు.

"నేను పీర్ తో మాటలాడుతాను లే . అరసు ను ఈ రాత్రి వాళ్ళింట్లో పడుకో మందాము. పీర్ చిన్న పిల్ల ఆయష మన అరసు క్లాస్మేట్ కదా, హోమ్ వర్క్ లాంటి పనులు, కలిసి పూర్తి చేసుకోవచ్చు. పీర్ కొడుకు సలీం కూడ వాళ్ళిద్దరి కంటే ఓ సంవత్సరమే పెద్ద. బాగా కలిసిపోతారు, ఆడుకుంటారు" అన్నాడు పి.ఎల్

"మనం ఇద్దరూ ఇంటి పట్టు ఉండటం లేదు, వాడిని చూసుకోవడం తగ్గిపోయింది. ఇంట్లో ఆయా ఉన్న, అది సరి పోదు" చెల్వి అన్నది.

చెల్వి గొంతులోని కఠినానికి అలవాటు పడ్డ పి.ఎల్ నవ్వి, "ఇది వరకే చెప్పాను కదా, వాడిని వచ్చే సంవత్సరం ఊటీ లో బోర్డింగ్ స్కూల్లో చేర్పిద్దాం. వాడికి మంచి స్కూల్ దొరుకుతుంది, మన పనులకు అడ్డమూ ఉండదు" అన్నాడు పి.ఎల్.

ఫోన్ తీసి, బ్రాంచ్ మేనేజర్ వినోద్ నంబర్ కలిపాడు.

అవతల వినోద్ గొంతు వినగానే, "వినోద్, నేను పి.ఎల్ ని, చెన్నై ఆఫీసు ఓపెనింగ్ కు వెళ్తున్నాను. వస్తావా? నా పద్మిని కారులోనే వెళ్లి తిరిగి వచ్చేద్దాము. మధ్యాహ్నం ఒంటి గంటకు మీ రీజినల్ మేనేజర్ మా కొత్త ఆఫీసు, రిబ్బన్ కట్ చేస్తాడు. సాయంత్రం సవేరలో డిన్నర్ " అన్నాడు పి.ఎల్.

"అబ్బే పని ఉంది పి.ఎల్ గారు. పొద్దున పని వదలి రాలేను" అన్నాడు వినోద్.

"కనీసం డిన్నర్ కు సవేరకు వచ్చేయి వినోద్. నువ్వు రెండు ఏళ్ళ క్రితం బ్యాంక్ లోను ఇవ్వడం వల్లే, ఇప్పుడీ స్థాయిలో ఉన్నాను. ఫ్యాక్టరీలో కొత్త మషీన్లు, కొత్త పద్ధతులు, రెట్టింపు పని చేసే జనం, ఇప్పుడు చెన్నై లో మరో కొత్త ఆఫీసు. ఇంకేమి సాకులు చెప్పవద్దు" అన్నాడు పి ఎల్.

"సరే, నేను సాయంత్రం కొంచెం తొందరగా పని ముగించుకొని, సవేర హోటల్ లో డిన్నర్ కు కలుస్తాను" అని చెప్పి వినోద్ సంభాషణ అప్పటికి ముగించేశాడు.

పి.ఎల్ కారు డ్రైవరును పిలిచి కారులో చెన్నై బయలు దేరాడు. మూడు గంటల ప్రయాణం. మధ్యాహ్నం 12 కంతా ఆఫీసుకు చేరుకోగలిగాడు. చెన్నై ఆఫీసులో పని కని ఓ సి.ఏ. చేసిన మహేష్ ను వెదికి పట్టుకొని, తను కోరినట్లు పని చేయగలడు అని నమ్మకం కుదిరిన తరువాతనే ఉద్యోగమిచ్చాడు. మహేష్ కు సహాయం కోసం హేమ అనే ఆవిడకు కూడా ఉద్యోగం ఇచ్చాడు. మహేష్ ఓవర్ అక్టీవ్ మనిషి. జీని లాగా పని చేసి, మరేం చేయ మంటారు అనే రకం. లోకం పోకడ బాగా తెలిసిన మనిషి. హేమ టైపింగ్ వచ్చు కానీ, పని తెలియదు. ఇలాంటి పని తెలియని ఆవిడని పి.ఎల్. ఎలా సెలెక్ట్ చేసాడు అని మహేష్ కు అప్పుడప్పుడు అనుమానం వచ్చేది. ఆ కారణం పి.ఎల్ కు మాత్రమే తెలిసి ఉండాలి.

మహేష్ ఆఫీసు అందంగా పేపర్లు, బెలూన్లు, పూలు అలంకరించి, ద్వారం దగ్గర ఎర్రటి రిబ్బన్ ఒకటి అడ్డంగా కట్టాడు. ద్వారం పక్కనే ఉన్న టేబిల్ పైన ఓ వెండి పళ్ళెంలో పూలు, కత్తెర పెట్టి, హేమకు ఆ పళ్లెం, కత్తెర, రీజినల్

మేనేజర్ వచ్చిన వెంటనే, ఆయనకు అందచేయమని చెప్పాడు. రిబ్బన్ కటింగ్ అయిన వెంటనే, ఉన్న వారికి లంచ్ కి క్యాటరింగ్ ఆర్డర్ చేసాడు.

రీజినల్ మేనేజర్, చెన్నై బ్రాంచ్ మేనేజర్, ఆ బ్రాంచ్ లోన్/ఫీల్డ్ ఆఫీసర్ తో బాటు వచ్చాడు.

పి.ఎల్, మహేష్ వారందరిని సాదరంగా ఆహ్వానించి, రీజినల్ మేనేజర్ తో రిబ్బన్ కట్టింగ్ తరువాత లోపల కేక్ కట్టింగ్ చేయించాడు. రీజినల్ మేనేజర్ పి.ఎల్ బిజినెస్ ఇదివరకు పార్టనర్ షిప్ నుండి పి.ఎల్ లెథర్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ గా మారడం, బిజినెస్ ఇంతగా ఎదగడం, దీని వెనుక ఉన్న పి.ఎల్ కృషిని, పులిహోర తో పాటు, వడ నంజుకుంటూ పొగిడాడు. చెన్నై బ్రాంచ్ మేనేజర్ కూడా తమ బ్రాంచ్ కు పి.ఎల్. లెథర్స్ అకౌంట్ దొరికినందుకు హర్షం వ్యక్త పరిచాడు.

రీజినల్ మేనేజర్ పని ఉందని వెళ్లి పోగా, బ్రాంచ్ మేనేజర్, ఫీల్డ్ ఆఫీసర్ ఇంకాసేపు ఉంటాము అన్నారు. పి.ఎల్ వారిని లోపల తన గదికి తీసుకెళ్లి కూర్చోబెట్టిన తరువాత, బిజినెస్ గురించి, రాబోయే చెక్కుల గురించి మాట్లాడడం మొదలెట్టారు. దానికి కారణం, 10 లక్షల లిమిట్ ఉన్న బ్యాంక్ లోను అకౌంట్లలో 25 లక్షల బ్యాలెన్స్ ఉంది. బ్రాంచ్ ఆడిట్ అయ్యితే పెద్ద గొడవ అవ్వుతుంది, బ్యాంక్ బాలన్స్ తిరిగి 10 లక్షలు చేయడానికి 15 లక్షలు వెంటనే జమ చేయాలని, ఎప్పుడు జమ చేస్తారని పి.ఎల్ ను అడగడం మొదలెట్టారు. ఇలాంటి పరిస్థితి వస్తుందనే ఊహించిన పి.ఎల్, మహేష్ ను, హేమను బయటి గదిలో ఉంచి, ఈ మేనేజర్లను మాత్రం తనతో లోపలి గదికి పట్టుకొచ్చాడు.

"మీకు తెలియంది ఏమి లేదు. ఆ 15 లక్షలు కూడా బిజినెస్ లోనే పెట్టాను. సిడ్కో వాళ్లు కొత్త ప్లాట్ ఇచ్చారు. మరో క్రోమ్ టానింగ్ ఫేక్టరీ ని మొదలు పెట్టాను. ఫ్యాక్టరీ, ఆఫీస్ , మెషీన్ లకని 20 లక్షలు ఖర్చు పెట్టాను. సిడ్కో వాళ్ళ దగ్గర నుంచి 30 లక్షల లోన్ రావాలి. అది ఆలస్యమౌతున్నది. మీ రీజినల్ మేనేజర్ తో మొన్ననే ఫోన్ లో మాట్లాడాను. రీజినల్ మేనేజర్ మరో మాసం ఆగడానికి ఒప్పుకున్నారు. మీరు మరీ కంగారు పడితే, మీ బ్యాంక్ ద్వారానే నేను ఆ 30 లక్షల లోన్ తీసుకోగలను. మీకు కావలసిన పేపర్లు మా మహేష్ సి ఏ తయారు చేసి ఇవ్వగలడు. తనను మీతో బాటు పని చేయ మని చెప్తాను.మీరు ఈ టర్మ్ లోన్ ప్రపోజల్ పంపిస్తే రీజినల్ మేనేజర్ అప్రూవ్ చేస్తానన్నాడు" అని చెప్పాడు పి.ఎల్.

"టర్మ్ లోన్ సిడ్కో నే ఇవ్వాలి. మా లాంటి బ్యాంకులు ఇవ్వకూడదు. రీజినల్ మేనేజర్ చెప్పారంటున్నారు. ఇంకో నెల ఆగుతాము లెండి" అన్నాడు బ్రాంచ్ మేనేజర్.

పి.ఎల్. టేబుల్ డ్రాయర్ తెరిచి, రెండు గిఫ్ట్ ప్యాకెట్లు తీసి బ్రాంచ్ మేనేజర్, ఫీల్డ్ ఆఫీసర్ చెరొకటి ఇచ్చాడు. ఆబ్బె ఎందుకండి అంటూనే, ఆ ప్యాకెట్ లు తమ బ్రీఫ్ కేసులు తెరిచి వేసుకొని, సెలవు తీసుకున్నారు.

"సాయంత్రం సవేరలో డిన్నర్ మరచి పోకండి. రీజినల్ మేనేజర్ కూడా వస్తున్నారు" అని పి.ఎల్. గుర్తు చేసాడు.

సాయంత్రం ఆరు కంతా, అందరూ తిరిగి సవేరా హోటల్ ఆవరణలో జతకూడారు. కాదంటే పొద్దున ఆఫీసులో ఉన్న హేమను పిలవలేదు. వినోద్ కూడ సవేరలో కలిసాడు.

పి.ఎల్. రీజినల్ మేనేజర్ తో వినోద్ తన బిజినెస్ ఎదగడానికి దోహద పడటం గురించి చెప్పి, "చాలా మంచి ఆఫీసర్, యువకుడైనా బ్యాంకింగ్, పరిశ్రమల అవసరాల పైన మంచి పట్టు ఉన్న మనిషి" అంటూ పొగిడాడు.

రీజినల్ మేనేజర్ "వినోద్ , నీ బ్రాంచ్ పని అయ్యిపోయిందా. చెన్నై కు ఓ సాయంత్రం కోసం రావాడం కష్టం కదా" అంటూ, పి.ఎల్ వైపు తిరిగి "భలే వారే, వినోద్ గురించి తెలియక పోవడమేమి? హీ ఈజ్ బ్రైట్ యంగ్ ఆఫీసర్" అని భోజనానికి రెస్టారెంట్ వైపు నడవడం మీదలెట్టాడు.

రెస్టారెంట్ లో ఉన్నంత సేపు పిచ్చాపాటి నే మాట్లాడారు. ఎక్కువగా రీజినల్ మేనేజర్ మాట్లా డుతుంటే, మిగతా వారంతా, వింటున్నారు. ఆ గుంపులో ఆల్ఫా మేల్ ఎవరో పెద్ద శ్రమ లేకుండానే తెలిసిపోతుంది.

అందరూ వీడ్కోలు తీసుకున్న తరువాత పి.ఎల్. మహేష్, వినోద్ మిగిలి పోయారు, "వినోద్ ఇంటికే కదా నా కారులో పోదాం" అన్నాడు పి.ఎల్.

వినోద్,"అబ్బే వద్దండి. ఈ రాత్రి మా బంధువులను ఇక్కడ చెన్నైలోనే కలుస్తానని చెప్పాను. అక్కడే పడుకొని, ప్రొద్దున్నే మొదటి బస్సులో వాపసు వచ్చేస్తాను" అని సున్నితంగా తప్పుకున్నాడు.

పి.ఎల్. సంజ్ఞ చేస్తే, మహేష్ ఓ కొత్త పాకెట్ కేల్క్యులేటర్ తన జేబులోనుంచి తీసి, వినోద్ కు ఇవ్వబోయాడు. పి.ఎల్. చెప్పినట్లు, మహేష్ చెన్నై పోర్ట్ కు ఆనుకొని ఉన్న బర్మా బజార్ లో ఇలాంటి విదేశీ వస్తువులు కొని, పండుగ, పబ్బం, ఎప్పుడు, ఎలాంటి సందర్భం వచ్చినా, ఆ మిషతో గిఫ్ట్ లు ఇవ్వడం పరిపాటి అయ్యిపోయింది. తరచు కొనడం వల్ల, బర్మా బజార్ బడ్డీకొట్టులలో ఒకతను బాగా పరిచయం అయ్యాడు. అతనికి ఫోన్ చేస్తే కావలసిన వస్తువులు, అప్పటికి అప్పుడు మహేష్ దగ్గరికి తెచ్చి ఇచ్చే వాడు. వాచీలు, పెర్ఫ్యూమ్స్, చీరలు, ఎలక్ట్రానిక్స్, ఏది డిమాండ్ లో ఉంటే అది.

వినోద్ కేల్క్యులేటర్ చూసి తిరిగి ఇచ్చేసాడు. "పి.ఎల్. గారు అవసరం లేదండి. కాలేజి నుంచి, కొత్తగా బ్యాంక్ లో చేరినప్పుడు, పేజీల కొద్దీ సంఖ్యలు కూడటం కష్టం గానే ఉండేది. ఇప్పుడు అలవాటైపోయింది. రెండు, మూడు స్థానాల అంకెలు కలిపి కూడా, కూడ గలను. కేల్క్యులేటర్ కంటే వేగంగానే, నా పని అయ్యిపోతుంది" వినోద్ కారణం చెప్పాడు.

పి.ఎల్. కు మనస్సు చివుక్కుమంది. "ఇలా ఉంటే నీవు ఎలా ఎదుగుతావు వినోద్. లోకం పోకడ నీకు బొత్తిగా తెలియదు. అందుకే నిన్ను రీజినల్ మేనేజర్ వస్తున్న ఈ పార్టీ కీ పిలిచాను. నీ ఎదురుగానే, నీ గురించి పొగిడాను. అలాగైన, నీకు రీజినల్ మేనేజర్ ప్రమోషన్ ఇస్తారని నా ఆశ" చెప్పాడు పి.ఎల్.

"మీ అకౌంట్ బ్యాంకుకు తేవడం, నాకు మంచి పేరే తెచ్చింది. కానీ బ్యాంక్ రూల్స్ ప్రకారం మీ అకౌంట్లు, మిగిలిన వారి అక్కౌంట్లు నడపాలనే నాప్రయత్నమే నన్ను ఈ పరిస్థితి కి తెచ్చింది" అన్నాడు వినోద్.

"నా అకౌంట్లు, నీకు ఈ సమస్య రాగుడదనే కదా, ఇక్కడ చెన్నైకి మార్పించుకున్నాను. ఇప్పుడు మీ బ్రాంచిలో అప్పుల అక్కౌంట్లు ఏమీ లేవు. అన్నీ చెన్నై బ్రాంచ్ లోనే ఉన్నాయి. నీ బ్రాంచ్ లో ఉన్నది ఒక కరెంట్ అకౌంట్ మాత్రమే. అందులో బ్యాలెన్స్ ఉంటే చెక్ పాస్ అవ్వుతుంది. లేకపోతే నువ్వే ఏ మాత్రం సంకోచం లేకుండా రిటర్న్ చేసేస్తావు" అన్నాడు పి.ఎల్.

*(కొనసాగింపు వచ్చే నెలలో)*

Post your comments